క్లుప్తంగా

తహసీల్దార్ నాగలక్ష్మమ్మ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ నాగలక్ష్మమ్మను అభినందిస్తున్న నాయకులు

అయినవిల్లి: కొత్త తహసీల్దార్‌గా సీహెచ్ నాగలక్ష్మమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె సఖినేటిపల్లి తహసీల్దార్‌గా పనిచేసి అయినవిల్లికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీపల్లవి పి.గన్నవరానికి బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ నాగలక్ష్మమ్మను కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు అభినందనలు తెలిపారు. రెవెన్యూ పరమైన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని నాగలక్ష్మమ్మ హామీ ఇచ్చారు.

నేత్రదానంపై అపోహలు విడనాడాలి

అంబాజీపేట: నేత్రదానం చేయడంలో ఉన్న అపోహలను విడనాడి, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మండల ఆప్తాలమిక్ అధికారి వి.ప్రభాకర్ అన్నారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరిగే జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పబ్బినీడి రాంబాబు, అంబాజీపేట ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొప్పేశ్వరాలయంలో అన్న సమారాధన ప్రారంభం



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట: పలివెల ఉమా కొప్పేశ్వరాలయంలో అన్నదాన కమిటీ చేస్తున్న మానవసేవ, మాధవసేవ కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రతి సోమవారం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కమిటీ సభ్యుడు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, సభ్యుల ఆధ్వర్యంలో అన్న సమారాధన పథకానికి శ్రీకారం చుట్టారు. దీనిని గురువారం ఎమ్మెల్యే బండారు లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పలు ప్రముఖ ఆలయాల్లో లాగే ఇక్కడ కూడా అన్నదానం అమలు చేయడంలో తోట వెంకటేశ్వరరావు, ఇతర భక్తుల చిత్తశుద్ధిని అభినందించారు. తన వంతుగా రూ.10,166 ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చవల జగన్నాథం, దేవస్థానం మాజీ చైర్మన్లు గొలకోటి శ్రీనివాస్, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన దాతృత్వం
స్కూల్ భవనం నిర్మాణం



దాత నరసింహచైనులు నిర్మించిన పాఠశాల అదనపు భవనం

మామిడికుదురు: అమెరికాలో ఇంజినీర్‌గా స్థిరపడిన ఆదుర్రు గ్రామానికి చెందిన డాక్టర్ ఉపాధ్యాయుల లక్ష్మీనరసింహచైనులు, అన్నపూర్ణ దంపతులు దాతృత్వాన్ని చాటుకున్నారు. తమ స్వగ్రామం ఆదుర్రులో సొంత నిధులు రూ.26 లక్షల వ్యయంతో రెండు గదులతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు భవనాన్ని నిర్మించారు. తాను చదివిన స్కూల్‌కు లక్ష్మీనరసింహచైనులు సొంత ఖర్చుతో భవనం నిర్మించారు. దాని తాళాలను గురువారం సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ గెద్దం మహాలక్ష్మమ్మ, గ్రామ పెద్దల సమక్షంలో హెచ్‌ఎం యాళ్ల పళ్లంరాజుకు అప్పగించారు. దాత కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎంపీపీ కుసుమ వనజ కుమారి వారిని అభినందించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మామిడికుదురు: విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగరం ఎస్సై చైతన్యకుమార్ హెచ్చరించారు. మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన గురువారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. విద్యా వ్యవస్థలో ర్యాగింగ్‌పై నిషేధం ఉందని ఎస్సై చెప్పారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే సమాచారాన్ని అధ్యాపకులకు తెలపాలన్నారు. ర్యాగింగ్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల వైపు యువత మళ్లకుండా, శ్రద్ధగా చదువుకోవాలని హితవు పలికారు. విద్యార్థినులతో గౌరవంగా వ్యవహరించాలన్నారు. సహాయ ప్రిన్సిపాల్ మోకా రంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచార ఉదంతం తీవ్రంగా కలచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా వైద్యుల రక్షణ కోసం సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలి. మహిళా వైద్యులకు, సిబ్బందికి ధైర్యాన్ని కల్పించాలి. మన రాష్ట్రంలో మహిళా వైద్యుల భద్రత కోసం ఆస్పత్రుల వద్ద పోలీసు రక్షణతో పాటు, అన్ని రకాల వసతులు కల్పించాలి. డ్రెస్సింగ్ రూము, రెస్ట్‌రూంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ ఎస్ నిహారిక, వైద్యాధికారి, పీహెచ్‌సీ, వానపల్లి, కొత్తపేట మండలం

రాత్రి సమయాల్లో భద్రతను కల్పించాలి



ఆస్పత్రుల్లో రాత్రి సమయాల్లో మేము విధులు నిర్వహిస్తున్నాం. కానీ మాకు భద్రత కనిపించడం లేదు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్య తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మా ఉద్యోగాలకు ఎంటువంటి భద్రత లేదన్న భయం మమ్మల్ని కలవరపెడుతోంది. మేము చేస్తున్న ఉద్యోగం రిస్క్‌తో కూడినది. మాకు భద్రత కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో జూనియర్ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలి. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.

– యల్లమెల్లి సుమ, నగరం పీహెచ్‌సీ, మామిడికుదురు మండలం

ఇలాగైతే 'సాగు'నా..!?

- అన్నదాతకు ఏడాదికి రూ.20 వేల హామీ ఊసెత్తని సీఎం చంద్రబాబు
- రైతు భరోసా పేరు మార్చారు మినహా సాయంపై స్పష్టత లేని కూటమి సర్కారు
- ఖరీఫ్ ప్రారంభమైనా.. అందని అన్నదాత సుఖీభవ



మొసలపల్లిలో వరి పంటకు మందు స్ప్రే చేస్తున్న రైతులు (ఫైల్)

అంబాజీపేట: కూటమి పాలనలో రైతులకు సాగు ఇబ్బందులు తప్పడం లేదు. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందుతుందని ఆశ పడిన రైతులకు నిరాశే మిగిలింది. ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు.. ఇప్పుడు రైతులకు మొండిచేయి చూపారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అంటూ మార్చారే మినహా సాయం మాత్రం అందించలేదని రైతులు పెదవి విరుస్తున్నారు. జూలై నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు అనుకూలంగానే కురిశాయి. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు.

కనీస ప్రకటన లేదు

పీఎం కిసాన్ పథకానికి కేంద్రం తొలి విడతగా రూ.2 వేలను రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సాయంపై ఊసేలేదు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. వారు అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా, రైతుల పెట్టుబడి సాయంపై కనీస ప్రకటన చేయలేదు. దీంతో సాగు ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లోని 11 మండలాలకు సంబంధించి 83 వేల మంది రైతులు, కౌలు రైతులు ఉన్నారు. పి.గన్నవరంలో 256,382, కొత్తపేటలో 34,702, రాజోలులో 8,650 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు.

గత ప్రభుత్వ ముందుచూపు

పంట సాగు కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభంలోనే పెట్టుబడి సాయాన్ని రైతన్నలకు అందించేది. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలు, రైతు భరోసా రూ.7,500 కలిసి ఏటా రూ.13,500 చొప్పున మూడు విడతలుగా రైతులకు జమయ్యేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో, తమకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయని అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మాట నిలబెట్టుకోవాలి



అధికారంలోకి వస్తే రైతులకు ఇస్తానన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇచ్చి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి. పంట పనులు ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందిస్తే.. రైతులకు అప్పు చేయాల్సిన పని ఉండదు. ఇప్పటి వరకూ రైతుల పెట్టుబడి సాయంపై ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

– దొమ్మేటి రాధా సూర్యనారాయణ, రైతు, ఇరుసుమండ.

ఇంత వరకు సాయం ప్రకటించలేదు



గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం ఖరీఫ్ పంట ప్రారంభంలోనే అందేది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ జరుగుతున్నా, ఇంత వరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం ప్రకటించలేదు. రైతులు వడ్డీలకు సొమ్ములు తెచ్చి సార్వా పెట్టుబడులు పెడుతున్నారు. సమయానికి కూటమి ప్రభుత్వం ఇస్తానన్న సాయం రూ.20 వేలు ఇస్తే బాగుంటుంది.

– నాగాబత్తుల సత్యానందం, రైతు, ఇరుసుమండ

ఆదేశాలు రాలేదు



అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు, వాటి మార్గదర్శకాలు ఇప్పటి వరకు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి వివరాలు వస్తే రైతులకు చెబుతాం. పీఎం కిసాన్‌కు సంబంధించి రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. ప్రస్తుతం ఈ–పంట నమోదు చేస్తున్నాం.

– ఎస్‌జేవీ రామమోహనరావు, ఏడీఏ, పి.గన్నవరం

ఓట్లు నమోదు చేయించుకోవాలి

అంబాజీపేట: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఉపాధ్యాయులు ఓటర్లుగా పేరు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎంఈఓ, మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల హెచ్‌ఎంలతో సమీక్ష జరిపారు. ఎమ్మెల్సీ ఎన్నికపై ఎన్నికల కమిషన్ జారీ చేసిన విధివిధానాలను వివరించారు. వచ్చే నెల మూడులోగా పూర్తి చేసిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందించాలన్నారు. సమావేశంలో ఆర్‌ఐ మహ్మద్ ఇబ్రహీం, ఎంఈఓలు కాంత్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, ఎంపీడీఓ

అంబాజీపేట: మండలంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు వైద్య సిబ్బందిని కోరారు. ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం హాలులో అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీల కార్యదర్శులతో అవగాహన సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీపీ దొమ్మేటి మాట్లాడుతూ ప్రస్తుతం వైరల్ ఫీవర్లు అధికంగా నమోదవుతున్నాయని, వారిని గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ ప్రతిరోజు చేపట్టాలని, దోమల నియంత్రణకు మందులను స్ప్రే చేయాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా ఆయా అంశాలపై చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలకు వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈఓపీఆర్డీ బి.మమత, పీహెచ్‌సీ వైద్యులు కేఎస్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం నేటి తరానికి ఆదర్శం



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ హరీష్

కొత్తపేట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం, ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శనీయమని ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. బండారుపేట సమీపంలోని అంబేడ్కర్ కాలనీలో నెలకొల్పిన అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఎంపీ ఆవిష్కరించారు. బిళ్లకుర్రు సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షతన వహించారు. ఎంపీతో పాటు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొని, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగంలో అన్ని వర్గాల వారికి హక్కులు కల్పించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. సర్పంచ్‌లు బూసి జయలక్ష్మి, పల్లి భీమారావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు బండారు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలోనూ రాణించాలి



అంబాజీపేటలో క్రీడాకారులకు మెడళ్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం సాయిరాం

అంబాజీపేట: క్రీడాకారులు చదువుతో పాటు, వివిధ క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హెచ్‌ఎం కడలి సాయిరాం అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో పీడీ కె.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సాయిరాం మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. మాజీ సర్పంచ్ కొర్లపాటి వరప్రసాదరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు కొర్లపాటి దొరబాబు రూ.6 వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు క్రీడాభారతి, జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మెడళ్లు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం రిటైర్డ్ పీడీ కట్ట పురుషోత్తంను ఘనంగా సత్కరించారు. అంతకుముందు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, బీఎస్‌ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన



అంతర్వేది దేవస్థానాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురువారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విస్తృతంగా పర్యటించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన భవనం నిర్మాణ పనులను దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఆలయ తూర్పువైపున ఉన్న ఎండోమెంట్స్ భూమి మెరక చేసే అంశంపై చర్చించారు. కోనేరు నిర్మాణం, భక్తుల వసతి భవనాల నిర్మాణాలపై సమీక్షించారు. సముద్ర తీరాన ఎండోమెంట్స్ గ్రాంటుతో దుస్తులు మార్చుకునే గదులు, టాయిలెట్ల ఏర్పాటు స్థలాలను పరిశీలించారు. లైట్‌హౌస్ వద్ద దేవస్థానానికి చెందిన స్థలాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దే అవకాశాలపై సమీక్షించారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిలిపే వరకు పోరాటం

రాజోలు: ఎస్సీ వర్గీకరణ నిలిపే వరకూ దశలవారీ పోరాటాలు చేయాలని మాలల న్యాయ పోరాట సమితి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు స్పష్టం చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద మండల జేఏసీ కన్వీనర్ మట్టా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సుప్రీం కోర్టు తీర్పుపై రివ్యూ పిటీషన్ వేస్తున్నట్టు తెలిపారు.

మధురమైన భాష తెలుగు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మామిడికుదురు: అన్ని భాషల కన్నా తెలుగు ఎంతో మధురమైనదని మామిడికుదురు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ నిరంజని అన్నారు. తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా గురువారం గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

అంబాజీపేట: దేశ భాషల్లో తెలుగు లెస్స అని స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కడలి సాయిరాం అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషను ప్రేమించే ప్రతి తెలుగు వారు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను గుర్తుంచుకోవాలన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను ముక్తేశ్వరం జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్‌లకు నివాళులర్పించారు. హెచ్‌ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షత వహించారు. విద్యార్థులకు తెలుగులో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలైన వారికి ఒలింపిక్ అసోసియేషన్ క్రీడా భారతి, కోనసీమ జిల్లా వారి సౌజన్యంతో ప్రశంసా పత్రాలు, మెడళ్లు బహూకరించారు.



అంబాజీపేటలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

తెలుగు పరిరక్షణకు పాటుపడాలి

మలికిపురం: తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలుగు ఉపాధ్యాయులు పెద్దింటి శేషప్రసాద్ అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి శేషప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు పద్యాలు, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కరెస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్, అడ్వయిజర్ నక్కా రమేష్, ఇతర ఉపాధ్యాయులు కలిసి శేషప్రసాద్‌ను సన్మానించారు. మలికిపురం డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.సతీష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి శివకోడు హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు కె.కామేశ్వరరావు తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. పవిత్రమైన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓలు నక్క రమేష్‌బాబు, కొమరగిరి విజయకుమార్, రోహిల్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్తపేట: ప్రతి ఇంటా తెలుగు వెలుగులు విరబూయాలని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ తెలుగు పండితులు దేవరకొండ శ్రీనివాస రమణారావును ఘనంగా సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తెలుగుతల్లి, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలతో అలరించారు. నృత్య ప్రదర్శనలు, పద్యపఠనం ఆకట్టుకున్నాయి.

పి.గన్నవరం: పోతవరం ప్రాథమిక పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు పి.పరశు రాముడిని సత్కరించారు.

రావులపాలెం: తెలుగు భాషా దినోత్సవాన్ని స్థానిక డిగ్రీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈతకోట హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

సంక్షిప్తంగా..

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లి, మట్టలదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు, వెదిరేశ్వరం, కోసూరినగర్, గరువు, ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం, మూలపాలెం ఫీడర్ల పరిధిలో శుక్రవారం 8 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ ఎం.రవి కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ తీగలు మార్చడం, మరమ్మతులు చేపడతారన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

రావులపాలెం: జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. పీడీ యువరాజు ఆధ్వర్యంలో జాతీయ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈతకోట హైస్కూల్లో పీటీ రామకృష్ణ ఆధ్వర్యంలో క్రీడ దినోత్సవం జరిగింది. పలు క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

వేధింపులపై ఫిర్యాదు చేయండి

ఆలమూరు: ఆకతాయిలు ఎవరైనా వేధింపులకు పాల్పడితే ఉపాధ్యాయుల సహకారంతో ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని రావులపాలెం సీఐ సీహెచ్.విద్యాసాగర్ కోరారు. స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థినులకు అవగాహన సదస్సు జరిగింది. హెచ్‌ఎం వి.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను సీఐ వివరించారు. ఎస్సై ఎం.అశోక్, ఎంఈఓ కేవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

తహసీల్దార్ మృత్యుంజయ రావు బాధ్యతల స్వీకరణ

మామిడికుదురు: కొత్త తహసీల్దార్‌గా మృత్యుంజయరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్ఏలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ పరమైన సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు.

బాధ్యతలు చేపట్టిన శ్రీపల్లవి

పి.గన్నవరం: కొత్త తహసీల్దార్‌గా పి.శ్రీపల్లవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇంతకు ముందు అయినవిల్లి తహసీల్దార్‌గా పని చేశారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీజేపీ సమావేశం

కొత్తపేట: సభ్యత్వ నమోదుపై బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంపతి కనకేశ్వరరావు గృహంలో గురువారం సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి మోక వెంకట సుబ్బారావు తదితరులు హాజరయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.